డిజిటల్ కార్డు సర్వేను పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

యాదగిరిగుట్ట, అక్టోబర్ 4 : అర్హులైన ప్రతి కుటుంబాకీ సంక్షేమ పథకాలను అదించేలా ప్రభుత్వం జారీ చేయనున్న డిజిటల్ కార్డు సర్వే పూర్తిస్థాయిలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన 8వ వార్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబంతో కలిగిన సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రత్యేకంగా నియమించిన బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించాలని, తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. 8వ వార్డులో రెండు బృందాలు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ వార్డులో 210 కుటుంబాలు ఉన్నాయని, అందులో 65 కుటుంబాల సర్వే పూర్తి చేశామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, తాసీల్దార్ దేశ్యానాయక్ పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : డీఏఓ

బొమ్మలరామారం : జలాల్‌పూర్‌లో వరి పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

బొమ్మలరామారం/ ఆలేరు రూరల్, అక్టోబర్ 4 : అగ్గితెగులు, రసం పీల్చే పురుగుల నుంచి వరి పైరును కాపాడుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్‌లో, ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో శుక్రవారం వరి పొలాలను పరిశీలించారు. వరి సాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గితెగులు నివారణకు లీటర్ నీటికి ఎసిఫేట్ 1.5గ్రాములు, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును 1.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పూత దశలో ఉన్నప్పుడు కాపర్, శిలీంద్రనాశిని మందులను పిచికారీ చేయవద్దన్నారు. ప్లాంటామైసిన్ 0.4 గ్రా, అగ్రిమైసిన్ 0.4 మాత్రమే వాడుకోవాలని సూచించారు. ఆకు నల్లి, కంకి నల్లి నివారణకు లీటరు నీటికి స్పైరోమెసిఫెన్ 1.0 మి.లీ. లేదా ప్రొఫినోపాస్ 2 మి.లీ. చొప్పున కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఏఈఓలు వెంకటేశ్, శాలిని, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీ

పెంట్రోల్ బంకులో కొలతలను పరిశీలిస్తున్న జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు

మోత్కూరు, అక్టోబర్ 4 : మున్సిపాలిటీలోని పెట్రోల్ బంకుల్లో జిల్లా తూనికలు, కొలతల అధికారి కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఎస్సార్, హిందుస్థాన్‌తో పాటు పలు పెట్రోల్ బంకులను పరిశీలించారు. పెట్రోల్ కొలతలను తనిఖీ చేశారు. షాంపిల్స్ సేకరించారు. పెట్రోల్, డీజిల్ కల్తీ చేసినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేశ్

రాజాపేట, అక్టోబర్ 4 : ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీలో చేపట్టిన పనులు, నర్సరీల నిర్వహణ, సోషల్ ఆడిట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీఓ కిషన్, ఈసీ కరుణాకర్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ

వలిగొండలో ప్లంబింగ్ నిర్మాణాలపై మంచినీటి సహాయకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 4 : మండలంలోని గ్రామ మంచినీటి సహాయకులకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మావతి మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ప్రజలందరికీ సురక్షితమైన మంచినీటిని అంతరాయం లేకుండా అందించాలన్నారు. చేతి పంపులతోపాటు పైపులైన్ మరమ్మతులను వెంటవెంటనే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మెహర్‌సాయి, మిషన్ భగీరథ ఫీల్డ్ అసిస్టెంట్లు భిక్షపతి, నర్సింహ, ఎల్లయ్య, శిక్షకులు వెంకట్‌రెడ్డి, రామనర్సయ్య పాల్గొన్నారు.

వలిగొండ : మంచినీటి సరఫరా సహాయకులకు ఎంపీడీఓ కార్యాలయంలో మూడో రోజు నిర్వహించిన శిక్షణలో ప్లంబింగ్ నిర్మాణాలపై మిషన్ భగీరథ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రశాంత్ కుమార్, ఎంపీఓ కేదారేశ్వర్, ఏఈలు మహేశ్, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

బాక్స్ క్రికెట్ స్టేడియం ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీశైలం

చౌటుప్పల్, అక్టోబర్ 4 : క్రీడలతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం అన్నారు. పట్టణంలోని బాలాజీ దేవాలయం వద్ద బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కొయ్యడ సైదులు, తాండూరి పరమేశ్, అంతటి బాలరాజు, గోశిక కరుణాకర్, జ్ఞానేశ్వర్, మునుకుంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

బీబీనగర్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలకు మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి శుక్రవారం వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, పంజాల పెంటయ్య, దస్తగిరి, సత్తయ్య, సురేశ్‌గౌడ్, లింగేశ్, ప్రవీణ్, శ్రీశైలం, వేణు, రఘు, నరేశ్, పక్కీర, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి నిత్యారాధనలు

అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో పూజలు నిర్వహించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.12,45,522 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ మాఢవీధుల్లోని సాంస్కృతిక మండపంలో శ్రీకళానిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది.

ధనలక్ష్మీదేవిగా అమ్మవారి దర్శనం

నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం పద్మావతి అమ్మవారిని ఆలయంలోని లక్ష్మీ మండపంలో ధనలక్ష్మీదేవిగా కొలువుదీర్చి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. ధనలక్ష్మి అమ్మవారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో సహస్ర దీపాలంకార సేవలో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 3వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసా వితరణ చేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. స్వర్ణగిరి క్షేత్రంలో నిత్యపూజలు నిర్వహించారు.

శ్రీచక్ర ప్రతిష్ఠకు దైవానుగ్రహం కీలకం : రమణానందమహర్షి

రమణేశ్వరంలో భక్తులతో శివలింగాల ప్రతిష్ఠ చేయిస్తున్న సిద్ధగురువు రమణానందమహర్షి

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 4 : శ్రీచక్ర ప్రతిష్ఠకు దైవానుగ్రహం ఎంతో కీలకమని, పూర్వజన్మ పుణ్య ఫలితంగానే శ్రీచక్ర ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగస్వాములవుతారని సిద్ధగురువు రమణానందమహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో నిర్వహిస్తున్న శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష ద్రవ్యాలతో హోమాది కార్యక్రమాలు చేపట్టి, భక్తులతో శివలింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి విశ్వశాంతిని ప్రసాదించేందుకు శ్రీచక్ర ప్రతిష్ఠ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. పూజల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మర్రి విజయలక్ష్మికి ఓయూ డాక్టరేట్

మర్రి విజయలక్ష్మి

మోత్కూరు, అక్టోబర్ 4 : మున్సిపాలిటీకి చెందిన మర్రి విజయలక్ష్మికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎ.కృష్ణ శైలజ నేతృత్వంలో 'ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ గ్యాస్ట్రో రిటైన్టివ్ ఫోటింగ్ మైక్రో స్ఫియర్స్ ఆఫ్ యాంటీ హైపర్ టెన్సివ్ డ్రగ్స్' అంశపై తాను చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ అందజేశారని ఆమె తెలిపారు. హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. తనకు డాక్టరేట్ రావడానికి కృషి చేసిన యూనివర్సిటీ టెక్నాలజీ ప్రొఫెసర్లకు విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ అభివృద్ధికి సహకరించాలి : మార్కెట్ చైర్‌పర్సన్

సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య

ఆలేరు రూరల్, అక్టోబర్ 4 : మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అయినాల చైతన్య అన్నారు. శుక్రవారం జరిగిన మార్కెట్ పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, మార్కెట్‌లోని గిడ్డంగుల మరమ్మతులు చేయించేందుకు తీర్మానాలు చేశామని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మార్కెట్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ సెక్రెటరీ పద్మజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, డైరెక్టర్లు కిష్టయ్య, విఠల్‌నాయక్, పాండురంగం, బాలరాజు, పట్టునాయక్, ఎండీ నజీరొద్దీన్, జహంగీర్, దానయ్య, మైసయ్య పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై ఎయిమ్స్ వైద్య సిబ్బందికి అవగాహన

బీబీనగర్ ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులకు అవగాహన ఆత్మరక్షణకు శిక్షణ ఇస్తున్న ఆర్మీ ఆఫీసర్లు

బీబీనగర్, అక్టోబర్ 4 : పనిలో భాగంగా వైద్యులు, ఇతరుల నుంచి తమకు సమస్య ఎదురైన సమయంలో ఎలా ఎదుర్కోవాలనే దానిపై బీబీనగర్ ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులకు ఆర్మీ ఆఫీసర్ల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ నిపుణులు పనిలో ఊహించని సంఘటనల నుంచి రక్షించుకోడానికి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్మీ ఆఫీసర్ ఎన్‌బీ సుబేదార్ గౌతమ్ సింగ్ నాయకత్వంలో విద్యార్థులు నేర్చుకున్న టెక్నిక్‌లను సాధన చేయాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ పి.వర్గీస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిద్ధార్థ, డాక్టర్ ఏఎస్ సుబత్ర, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.శ్యామల పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : సీపీఎం

బొమ్మలరామారం, అక్టోబర్ 4 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో హామీలు అమలు చేయలేదన్నారు. రైతుభరోసా, పేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా ముద్దం మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. దేశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటేశ్, దేవేందర్‌రెడ్డి, నర్సింహ, లక్ష్మి, కొమురయ్య, జంగయ్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

అడ్డగూడూరు, సెప్టెంబర్ 4 : మండలంలోని డి.రేపాక గ్రామంలో మద్యం మత్తులో భార్యను హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.రేపాక గ్రామానికి చెందిన బొనుగ కృష్ణారెడ్డి, అదే గ్రామానికి చెందిన స్వరూపకు 30ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉండగా.. పది సంవత్సరాల క్రితం పెండ్లి చేశారు. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, కొంతకాలంగా మద్యానికి బానిసైన కృష్ణారెడ్డి.. తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం మద్యం తాగి వచ్చిన కృష్ణారెడ్డి భార్యతో గొడవపడి స్వరూప (46) మెడకు చీర కట్టి గట్టిగా లాగడంతో ఊపిరాడక మృతిచెందింది. విషయం తెలుసుకున్న భువనగిరి ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, క్లూస్ టీం, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లుతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి తండ్రి సంగు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- డ్రైవర్ మృతి.. మరొకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 4 : మండలంలోని ఎల్లగిరి గ్రామ పరిధిలోని జాతీయ రహదారి 65పై ఆటోను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన మట్టిపల్లి నర్సింహ (46) శుక్రవారం ఉదయం చిట్యాల నుంచి హైదరాబాద్‌కు తన ఆటోలో ప్రయాణికులను తీసుకొని వెళ్తుండగా ఎల్లగిరి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దాంతో ఆటో డ్రైవర్ నర్సింహ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న బాలాల లక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వెంకటయ్య (ఫైల్)

మోత్కూరు, అక్టోబర్ 4 : మండలంలోని అనాజిపురంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురానికి చెందిన మన్నె వెంకటయ్య (65) పొడిచేడులోని తన బంధువుల ఇంటికి వచ్చి శుక్రవారం రాత్రి బైక్‌పై తన స్వగ్రామం వెళ్తున్నాడు. అనాజిపురంలోని చెరువు కట్ట వద్ద బైక్ అదుపు తప్పి కిందపడగా తీవ్రగాయాలై మృతిచెందాడు. స్థానికులు గుర్తించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష

భువనగిరి అర్బన్, అక్టోబర్ 4 : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా వైద్యులను లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు 3వేల జరిమానా విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వైద్య శాఖలో పని చేసే ఎస్సీ, ఎస్టీ మహిళలను అదే వైద్య శాఖలో పనిచేసే డాక్టర్ దురిశెట్టి కాళిదాసాచారి లైంగిక వేధింపులకు గురిచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. విచారించిన కోర్టు నిందితుడికి మూడేండ్ల జైలు, రూ.3వేల జరిమానా విధించింది.

ఎల్ఈడీ లైట్లు అందజేత

రాజాపేట : మండలంలోని చిన్నమేడారం సమక్క సారక్క ఆలయానికి జాల గ్రామ మాజీ ఉప సర్పంచ్ గంధమల్ల నర్సింహులు రూ.12వేల విలువైన ఐదు ఎల్ఈడీ లైట్లను అలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

యువకులు శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

చీకటిమామిడిలో జిమ్‌ను ప్రారంభించి జిమ్ చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం, అక్టోబర్ 4 : యువకులు అన్ని రంగాల్లో రాణించడానికి ఆరోగ్యం తోడ్పడుతుందని, అందుకొసం శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం దేవీనవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మల్లేశం, శ్రీరాములు, చీర్ల రాజేశ్వర్, రామస్వామి, శ్రీహరి నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, అక్టోబర్ 4 : మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల విలువైన చెక్కులను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్కారు మారినా అభివృద్ధికి నోచుకోని యాదగిరిగుట్ట

- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 4 : రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా భక్తుల పూజలందుకుంటున్న యాదగిరిగుట్ట కొండపైన అభివృద్ధి ఆగిపోయిందని, ప్రభుత్వం మారినా అభివృద్ధిలో మార్పు రాలేదని బీజేపీ శాసన సభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైలారిగూడెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. యాదగిరిగుట్టలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. రుణమాఫీ సగం మంది రైతులకు కూడా కాలేదని, సాంకేతిక సమస్య సాకుతో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. రుణమాఫీపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి అశోక్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే మండల అభివృద్ధి సాధ్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

అడ్డగూడూరు, సెప్టెంబర్ 4 : ప్రజా పోరాటాల ద్వారానే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సీపీఎం మండల 3వ మహాసభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 17 మండలాల్లో అడ్డగూడూరు అత్యంత వెనుకబడిన మండలం అన్నారు. మండలంలో ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామేల్ తన సొంత మండలాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో కార్యాచరణ ప్రకటించాలన్నారు. మండల సమగ్రాభివృద్ధి కోసం త్వరలో అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, విద్యావేత్తలతో చర్చాగోష్ఠి పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. బునాదిగాని కాల్వకు రూ.269 కోట్లు కేటాయించామని చెప్తున్న ప్రభుత్వం.. ఆ నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పడం లేదని విమర్శించారు. నవంబర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి తేలియజేస్తామని తెలిపారు. అనంతరం సీపీఎం మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బుర్రు అనిల్‌కుమ